
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 9 జూన్ 2024



నిరుపయోగంగా వైకుంఠధామాలు - 8లో..

మల్లన్న సాగర్‌తో సస్యశ్యామలం - 8లో..

గ్రూప్ 1 పరీక్షకు సర్వం సిద్ధం



- నేడు ప్రిలిమినరీ
- జిల్లాలో 15 కేంద్రాలు, 4,699 మంది అభ్యర్థులు
- కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్షకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఆదివారం నిర్వహించనున్న పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో 15 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు సిద్ధం చేశారు. పరీక్షలకు 4699 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచేలా చర్యలు తీసుకున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 12 పరీక్ష కేంద్రాలతోపాటు వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలోని జేఎన్‌టీయూ యూనివర్సిటీ కాలేజీ, ఎస్‌ఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కాలేజీ, వేములవాడ ఆర్టీసీ బస్‌డిపో దగ్గర మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల సమాచారం కోసం బస్టాండ్, ప్రధాన కూడళ్లలో సమాచారం ఇవ్వడానికి హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్‌డెస్క్ 9398684240 నంబరు అందుబాటులో ఉంచారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్ష హాల్‌లోకి అనుమతించనున్నారు. ఉదయం 10.15 గంటల అనంతరం అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించరు. బయోమెట్రిక్ విధానం ఉండడంతో అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచనలు చేశారు.

300 మందికి పైగా సిబ్బంది

జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలకు 5 రూట్‌లను ఏర్పాటు చేశారు. 300 మందికిపైగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రాల్లో మొదటి రూటులో వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో 366 మంది విద్యార్థులు, వేములవాడ అగ్రహారంలోని ఎస్‌ఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో 288 మంది, వేములవాడ ఆర్టీసీ బస్‌డిపో దగ్గర తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 240 మంది, రెండో రూట్‌లో సిరిసిల్లలోని కోర్టు సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 400 మంది, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 336 మంది, వెంకంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పరిషత్ ఉన్నత పాఠశాలలో 240 మంది, మూడో రూట్‌లో సిరిసిల్లలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని జడ్పీ హెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో 360 మంది అభ్యర్థులు, విద్యానగర్ నారాయణ స్కూల్ 384 మంది, పోచమ్మ టెంపుల్ భావనారుషినగర్ చైతన్య హైస్కూల్ కేంద్రంలో 240 మంది అభ్యర్థులకు ఏర్పాట్లు చేశారు. నాలుగో రూట్‌లో పాతబస్టాండ్ వద్ద శ్రీవాని డిగ్రీ కళాశాలో 240 మంది, సాయిశ్రీ జూనియర్ కళాశాలలో వాణి నర్సింగ్ హోం దగ్గర 336 మంది, అనంతనగర్ వాణి నర్సింగ్‌హోం వెనకాల శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలలో 360 మంది, ఐదో రూట్‌లో సిరిసిల్ల పత్తిపాక వీధి సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 213 మంది, కోణార్క్ ఆసుపత్రి ఎదుట వికాస్ డిగ్రీ కళాశాలలో 360 మంది, శివనగర్‌లోని సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియంలో 144 మంది, మెహెర్‌నగర్ సిరి హాస్పిటల్ దగ్గర శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 336 మంది అభ్యర్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేశారు. పరీక్షల ఐదు రూట్లకు లైజనింగ్ అధికారులు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 20 మంది సిట్టింగ్ స్క్వాడ్, అసిస్టెంట్ లైజనింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లు ఉంటారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

భారీ పోలీస్ బందోబస్తు

జిల్లాలో నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదు రూట్లలో మొబైల్ ఎస్కార్ట్ పార్టీలతో పాటు అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్‌లు, హోంగార్డులు బందోబస్తు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ముందస్తుగానే జిరాక్స్ సెంటర్‌లను మూసివేస్తున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది.

అభ్యర్థులు పాటించాల్సిన సూచనలు

- టీజీపీఎస్‌సీ వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలి.
- హాల్ టికెట్‌తోపాటు పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ, అధార్‌కార్డు, ప్రభుత్వ ఉద్యోగిగా ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదో ఒకటి గుర్తింపు కార్డుగా వెంట తీసుకెళ్లాలి.
- హాల్ టికెట్ మీద ఫొటో, సంతకం స్పష్టంగా కనిపించాలి. ఏ4 షీట్‌పై హాల్ టికెట్ ప్రింట్ తీసుకోవాలి. కలర్ ప్రింట్ ఉంటే ఇంకా మంచిది.
- హాల్ టికెట్‌పై ఫొటో/సంతకం స్పష్టంగా కనిపించకపోతే అభ్యర్థులు మూడు పాస్ పోర్టు ఫొటోలు వెంట తీసుకురావాలి. ఆ ఫొటోలను గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్టెడ్ చేయించాలి. వాటితోపాటు అండర్ టేకింగ్‌ను సైతం ఇన్విజిలేటర్‌కు అందించాలి.
- పరీక్ష 10.30 నిమిషాలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే అంటే 8.30 గంటల నుంచే సెంటర్‌లోకి అనుమతిస్తారు. అరగంట ముందే గేట్ మూసివేస్తారు. ఒక్కసారి గేట్ మూస్తే పరీక్ష ముగిసే వరకు తెరవరు.
- క్యాలిక్యులేటర్స్, మ్యాథ్స్ టేబుల్స్, లాగ్ బుక్స్, పేపర్స్, సెల్ ఫోన్, ట్యాబ్లెట్స్, పెన్ డ్రైవ్, బ్లూటూత్ పరికరాలు, వాచ్, లాగ్ టేబుల్స్, వాలెట్, హ్యాండ్ బ్యాగ్స్, రైటింగ్ ప్యాడ్స్, చార్ట్స్ వంటివి పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.
- షూ వేసుకొని ఎగ్జామ్‌కు రావొద్దు. కేవలం చెప్పులతో మాత్రమే రావాలి.
- పరీక్ష కేంద్రం వద్ద వస్తువులను దాచడానికి ఏర్పాట్లు ఉండవు.
- పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల వేలిముద్ర తీసుకుంటారు. అభ్యర్థులు మెహందీ, ఇంక్, టాటూలు వేసుకోవద్దు.
- హాజరైన అభ్యర్థితో అభ్యర్థి హాల్ టికెట్‌పై ఉన్న ఫొటోతో వెంట తీసుకొచ్చిన ఐడెంటిటీ కార్డుపై ఉన్న ఫొటోను పరిశీలిస్తారు. తప్పు అని తేలితే చర్యలు ఉంటాయి.
- ఓఎంఆర్ షీట్‌పై హాల్ టికెట్ నంబర్, టెస్ట్ బుక్ లెట్ నంబర్, వెన్యూ కోడ్ నమోదు చేయడానికి అభ్యర్థి బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌ను మాత్రమే వాడాలి. ఇంక్ పెన్‌ను వాడినా.. సూచించిన ప్రదేశాల్లో కాకుండా.. ఇతర చోట పెన్‌తో ఏమైనా రాసినా ఓఎంఆర్ షీట్‌ను ఇన్‌వ్యాలిడ్‌గా పరిగణిస్తారు.
- ఓఎంఆర్ షీట్ లేదా టెస్ట్ బుక్ లెట్‌లో ఏమైనా డిఫెక్ట్ అనిపిస్తే మార్చమని ఇన్విజిలేటర్‌ను కోరవచ్చు.
- ఓఎంఆర్ షీట్ పైన ఆన్సర్ చేయడానికి బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను మాత్రమే వాడాలి. పెన్సిల్/ఇంక్ పెన్/జెల్ పెన్‌ను వాడితే ఆన్సర్ షీట్ ను ఇన్ వ్యాలిడ్‌గా పరిగణిస్తారు.
- వైట్నర్, చాక్ పౌడర్, బ్లేడ్, ఎరేజర్‌ను ఓఎంఆర్ షీట్‌పై వినియోగిస్తే ఓఎంఆర్ షీట్‌ను ఇన్‌వ్యాలిడ్‌గా పరిగణిస్తారు.
- పరీక్ష కేంద్రంలో ఇతరులతో మాట్లాడడం, వస్తువులను పక్కవారి నుంచి అడగడం, స్లోగన్స్ చేయడం, ఇతరులకు ఇబ్బంది కలిగించడం చేస్తే చర్యలు ఉంటాయి.
- పరీక్ష సమయం ముగిసే వరకు అభ్యర్థులు బయటకు వెళ్లేందుకు అనుమతించరు.
- అభ్యర్థుల సౌకర్యం కోసం అరగంటకోసారి బెల్ మోగిస్తారు.
- అభ్యర్థులు పరీక్ష ముగిసే వరకు పరీక్ష కేంద్రం విడిచి వెళ్ల కూడదు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, జూన్ 8: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా రాజన్న ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివారం దేవతార్చనలు నిర్వ హించారు. సాయంత్రం సదస్యం నిర్వహించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

టీకాల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: చిన్నారులకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు కిషన్‌దాస్‌పేటలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. టీకాల పంపిణీ తీరును పరిశీలించారు. ఎంత మంది చిన్నారులకు టీకాలను వేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవల అందించాలని సూచించారు. సీహెచ్‌వో బాలచంద్రం, హెల్త్ అసిస్టెంట్ రమేశ్ ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, జూన్ 8: మండలంలోని పెద్దలింగాపూర్‌లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద వ్యవసాయ కార్మిక సదస్సు కరపత్రాన్ని జిల్లా కార్యదర్శి గన్నారం నర్సయ్య ఆవిష్కరించారు. ఉపాధిహామీ పనులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వ్యవసాయ కార్మిక సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఉపాధిహామీ అమలులో ఎదురవుతున్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా మండల పూజలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లోని సీతారామాంజనేస్వామి ఆలయంలో శనివారం మండల పూజలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు ఆంజనేయశర్మ, వాసుశర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి, నవగ్రహాల పూజ, అభిషేకం చేశారు. ఎంపీటీసీ బాబు, మాజీ సర్పంచ్ రవీందర్, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద కిషన్‌రావు, వెంకట్‌రావు, తిరుమల్‌రావు, కిషన్‌రావు, హన్మంతరావు, సతీష్, రవీందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం



సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద వరదనీరు

సిరిసిల్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి జిల్లా కేంద్రంలో పలు చోట్ల రోడ్లపై వరదనీరు ప్రవహించింది. పిడుగుల శబ్దాలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. శనివారం సాయంత్రం సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలంలో వర్షం కురవడంతో ఎండతో సతమతమవుతున్న ప్రజలు కాస్తా ఉపశమనం పొందారు. తంగళ్లపల్లి మండలం తాడూర్‌లో పశువుల షెడ్డు కూలడంతో కిసాన్ అనే రైతుకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి.

పిడుగు పాటుతో ఆవు మృతి

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌కు చెందిన రైతు ఉమ్మారెడ్డి కరుణాకర్‌రెడ్డి చెందిన ఆవు శనివారం పిడుగుపాటుకు మృతిచెందింది. దీంతో సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రాజీయే రాజమార్గం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత

సిరిసిల్ల క్రైం, జూన్ 8: రాజీయే రాజమార్గమని జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత అన్నారు. సిరిసిల్ల జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మూడు బెంచ్‌ల ద్వారా 6788 కేసులు పరిష్కరించినట్లు, రూ.71.56 లక్షల చెల్లింపులు జరిగినట్లు చెప్పారు. ఇందులో పీడీజే, 1వ అడిషనల్ కోర్టులో 4, సీనియర్ సివిల్ కోర్టులో 1, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో 88, 1వ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో 146, 2వ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో 101, వేములవాడ జూనియర్ సివిల్ కోర్టులో 422, సెకండ్ క్లాస్ కోర్టులో 1430, డీఎల్‌ఎస్‌ఏలో బ్యాంకు పీఎల్‌సీలు 2, బీఎస్‌ఎన్‌ఎల్ పీఎల్‌సీలు 14, ట్రాఫిక్ పీఎల్‌సీలు 4580 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయసేవలను ఉపయోగించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీస్, ఎక్సైజ్ శాఖల ఎస్‌హెచ్‌వోలు, కోర్టు కానిస్టేబుళ్లు ప్రత్యేక చొరవచూపారన్నారు భార్యాభర్తల కేసుల్లో రాజీ ఏర్పడడంతో పలువురు దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సృజన, సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు దోర్నాల సంజీవరెడ్డి, గుడిసె సదానందం, కార్యదర్శి వెంకటి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 8: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన పెండింగ్ ఫైల్స్‌ను ప్రభుత్వం వెంటనే క్లియర్ చేయాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులు, సహజంగా, అనారోగ్యంతో మరణించిన కార్మిక కుటుంబాలకు ప్రభుత్వ బెనిఫిట్స్‌ను అందించాలన్నారు. మహిళా కార్మికులకు సంబంధించిన బెనిఫిట్స్‌ను అదించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు నల్ల చంద్రమౌళి, చిలుక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం : ఎమ్మెల్యే



క్రీడాకారులతో ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, జూన్ 8:క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలో వీకేఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిసాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు ఆనందరెడ్డి, బాలపోచయ్య, తూముకుంట రాజేందర్ రెడ్డి, మంద బాల్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, లింగం, ఒగ్గు రమేష్, శ్రీనివాస్, జమాల్, సంతోష్, రాకేష్, ముస్తాఫా, గురువారెడ్డి, ప్రసాద్, నరేందర్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రగుడు జంక్షన్

- నిలిచిన ఆధునికీకరణ పనులు
- సైడ్‌వాల్స్ లేని బ్రిడ్జిలు - ఆందోళనలో వాహనదారులు



ప్రదకరంగా జంక్షన్



సిరిసిల్ల రగుడు జంక్షన్

సిరిసిల్ల రూరల్, జూన్ 8: సిరిసిల్లలోని రగుడు వద్ద ఏర్పాటు చేసిన జంక్షన్ ఆధునికీకరణ పనులు నిలిచిపోవడం, బ్రిడ్జిలకు సైడ్ వాల్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని విలీన గ్రామం రగుడు జంక్షన్ నుంచి కామారెడ్డి వెళ్లేందుకు ఫోర్‌లైన్ రెండో బైపాస్ రోడ్డును నిర్మించారు. అదే జంక్షన్ నుంచి సిద్దిపేటకు వెళ్లేందుకు సైతం ఫోర్‌లైన్ మొదటి బైపాస్ రోడ్డుతోపాటు సిరిసిల్ల పట్టణానికి వచ్చేందుకు ఫోర్‌లైన్ రోడ్డును నిర్మించారు. ఈ మూడు రహదారులు రగుడు జంక్షన్‌లో కలుస్తుండడంతోపాటు ఆ జంక్షన్‌లో ఉన్న కాలువలపై బ్రిడ్జిలను నిర్మించారు. మూడు రహదారులు ఒకే దగ్గర ఉండడంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు బ్రిడ్జిలకు అడ్డుగా గోడలను ఏర్పాటు చేయకపోవడంతోపాటు జంక్షన్ ఆధునికీకరణ కోసం మున్సిపల్ నుంచి రూ.7 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ జంక్షన్ చుట్టూ భూమిని తవ్వివదిలి వేశాడు. అవి కూడా ప్రమాదాలకు నిలయంగా మారాయి. నిత్యం వాహనాదారులు వేగంగా వచ్చి వాటిల్లో పడిపోతున్నారు. అధికారులు స్పందించడంలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలని, ప్రమాదకరంగా ఉన్న జంక్షన్‌ను పరిశీలించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జంక్షన్‌ను పట్టించుకోవడం లేదు



- మొగిలి నాగరాజు, చంద్రంపేట

రగుడు జంక్షన్ ప్రమాదకరంగా మారింది. మూడు రోడ్లకు నిర్మించిన బ్రిడ్జిలకు గోడలను ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రిపూట వాహనదారులు అందులో పడి గాయపడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సైదాపూర్, జూన్ 8: పురుగుల మందు తాగిన సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామా నికి చెందిన కస్తూరి బ్రహ్మాచారి(75) అనే వృద్ధుడు శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మాచారికి ముగ్గురు కూతు ళ్లు, కుమారుడు ఉన్నారు. ఏడు ఏళ్ల క్రితం కొడుకు చనిపోయాడు. అప్పటినుంచి బ్రహ్మాచారి మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం పురుగుల మందు తాగాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బ్రహ్మాచారి కూతురు మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు

వ్యవసాయ బావిలో పడి దినసరి కూలీ మృతి

సైదాపూర్, జూన్ 8: మండలంలోని గుజ్జులపల్లి గ్రామ శివారులో వ్యవసాయ బావికి గాజులు పోస్తుండగా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన మెట్ట మొగిళి(45) అనే దినసరి కూలీ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిళి బావికి గాజులు పోసేందుకు రోజు కూలీ పనికి వస్తుండేవాడు. అదే క్రమంలో శనివారం గాజు పోస్తుండగా బావిలో పడిపోయాడు. స్థానికులు, తోటి కూలీలు బావిలో నుంచి మొగిళిని బయటకు తీసి చూడగా మృతి చెందాడు. దీనిపై ఎస్సై జన్ను ఆరోగ్యంను వివరణ కోరగా తమకు సమాచారం లేదని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని తెలిపారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

ఇద్దరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కొడిమ్యాల, జూన్ 8: మండలంలోని తురుకకాశీనగర్ గ్రామ శివారులోని రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రాత్రి మంగపేటకు చెందిన నల్ల పవన్, నల్ల సాగర్‌లపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు పవన్ ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు తెలిపారు. మంగపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు గంగాధర వైపు నుంచి మంగపేటకు వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు రాడ్లతో కొట్టగా గాయాలైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సుందిళ్ల బ్యారేజీని సందర్శించిన జస్టిస్ చంద్రఘోష్


బ్యారేజీ పనులను పరిశీలిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్

మంథనిరూరల్, జూన్ 8: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం సుందిళ్ల వద్ద నిర్మించిన పార్వతి బ్యారేజీని జస్టిస్ పినాకి చంద్రఘోష్ శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. గతంలో జరిగిన పనులకు, ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి ఈనెల 10వ తేదీ వరకు నివేదిక ఇవ్వాలని ఆయన నీటి పారుదల శాఖాధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలను గుర్తించేందుకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ చైర్మన్‌గా విచారణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. శుక్రవారం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలించిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ బృం దం శనివారం ఉదయం సుందిళ్ల బ్యారేజీ వద్దకు చేరుకుని పైనుంచి మొత్తం పరిశీలించి కింద పనులు జరుగుతున్న చోటికి వెళ్లి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న లోపాలను ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ నిర్మాణ నమూనాలను పరిశీలించారు. నిర్మాణాన్ని అడుగడుగునా క్షుణ్ణంగా పరిశీలించి గతంలో జరిగిన లోపాలు ఉన్న వాటికి, ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతు పనులకు సంబంధించి ఈనెల 10వ తేదీ నాటికి నివేదిక సమర్పిం చాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ సందర్శనకు ముందు రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో ఉన్న అతి ప్రాచీనమైన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జస్టిస్ చంద్రఘోష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంటన ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంట ప్రశాంత్‌జీవన్ నవయుగ డైరెక్టర్ రమేశ్, జీఎం మాధవ్, ఈఎన్‌సీ ఓఅం డ్ఎం నాగేందర్, రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ కరుణాకర్ తదితరులు ఉన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 8: ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో భక్తుల రద్దీ పెరిగింది. సెలవురోజులు కావటం వల్ల శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. నవ దంపతులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కుబే రుడిని దర్శనం చేసుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చ కులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.

చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఈ నెల 3న నాలుగు నెలల చిన్నారి బుర్క అన్విశ్రీ జ్వరంతో మృతి చెందింది. తమ కూతురు మరణంపై అనుమానాలున్నాయని పేర్కొంటూ ఈ నెల 8న చిన్నారి తల్లి కైరుబి అలియాస్ ఇషిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఖననం చేసిన మృతదేహాన్ని శనివారం బయటకు తీసిన వైద్యాధికారులు పోస్టుమార్టం చేశారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రానికి చెందిన కైరుబి అదే గ్రామానికి చెందిన బుర్క రాకేశ్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండో సంతానమైన నాలుగు నెలల అన్విశ్రీకి గత నెల 29న స్థానిక ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. అదే రోజు చిన్నారికి జ్వరం వచ్చింది. మందులను వేసినా తగ్గలేదు. ఈ నెల 1న వాంతులు, విరేచనాలు అధికమయ్యాయి. చిన్నారిని తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది అందించిన మందులను వాడినా నయం కాలేదు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 3న మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పాప అప్పటికే మృతి చెందిందని వెల్లడించారు. చిన్నారి మృతదేహాన్ని స్థానిక గిద్దె చెరువు సమీపంలోని శ్మశాన వాటికలో ఖననం చేశారు. తమ కూతురు మరణానికి గల కారణాలను తెలుసుకోవాలని, చర్యలు తీసుకోవాలని చిన్నారి తల్లి కైరుబి అలియాస్ ఇషిత పోలీస్ స్టేషన్‌లో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఖననం చేసిన చిన్నారి మృతదేహానికి బయటకు తీసి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి ప్రత్యేక వైద్యాధికారుల బృందం శ్మశాన వాటికలో పోస్టుమార్టం నిర్వహించింది. ఆర్ఐ సంతోష్ సమక్షంలో పంచనామా నిర్వహించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమాకాంత్ తెలిపారు.

పోలీస్ జాగిలం మృతి


జాగిలంకు నివాళులు అర్పిస్తున్న ఎస్పీ , పోలీసులు

తంగళ్లపల్లి, జూన్ 8: ఎన్నో ఏళ్లుగా పోలీస్ సేవలు అందించిన జాగిలం రాజా అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. తంగళ్లపల్లి మండలం తాడూర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించి జాగిలం మృతదేహం వద్ద జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాగి లం జిల్లాలో అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత 14 సంవ్సతరాల నుంచి జిల్లాలో వీవీఐపీ, వీఐపీలు సందర్శించినపుడు స్నీపర్స్, బాంబులు, మందుపాతరలు గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించి విధులు నిర్వహించిందని కొనియాడారు. 2010 సంవత్సరంలో తన హ్యాండ్లర్ మల్లేశంతో పాటు 8 నెలల పాటు ఐటీఏ మోయినాబాద్ నందు బేసిక్ ట్రేయినింగ్ పూర్తి చేసుకోని జిల్లాలో 14 సంవత్సరాలుగా సేవలు అందించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేష్, రాజా హ్యాండ్లర్ మల్లేశం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇంటికి నిప్పు


మంటలు అంటుకున్న ఇల్లు

తంగళ్లపల్లి, జూన్ 8: మద్యం మత్తులో భార్యతో గొడవపడిన భర్త ఇల్లు తగులబెట్టిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన ముడారి బాల పోచయ్య మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవపడే వాడు. శనివారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి చేరుకున్న బాలపోచయ్య అతడి భార్య రాజేశ్వరితో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం తలెత్తింది. మద్యం మత్తులో ఉన్న బాలపోచయ్య కోపోద్రిక్తుడై రాజేశ్వరి ఒంటిపై, అలాగే ఇంట్లో వస్తువులతోపాటు తనపై కిరోసిన్ పోసుకొని నిప్పుపెట్టే ప్రయత్నం చేశాడు. రాజేశ్వరి ఇంటి నుంచి బయటకు పరుగెత్తింది. ఆమె బయటకు వెళ్లడం తో ఆగ్రహంతో బయటికి వచ్చి ఇంటికి నిప్పు పెట్టాడు. మంటలు ఉవ్వెతున ఎగిసిపడడంతో స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బాల పోచయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కొండగట్టులో భక్తుల సందడి


ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మల్యాల, జూన్ 8: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. పాఠశాలల వేసవి సెలవులు ముగుస్తుండడం, వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● జనసేన నాయకుల పూజలు..

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో జనసేన ఘన విజయం సాధించడం, పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్ గెలుపొందడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనసేన పార్టీ నాయకులు కొండగట్టు అంజన్నను దర్శించుకొని పూజలు చేశారు.. అంజన్న ఆశీస్సులతో విజయం సాధించామని తెలిపారు. కార్యక్రమంలో జనార్దన్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, అజయ్, రామారావు, గణేశ్, వెంకటేష్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి

మల్లాపూర్, జూన్ 8: మల్లాపూర్ మండల కేంద్రంలో పాము కాటుతో మోతె జ్ఞానేశ్వర్(15)అనే బాలుడు మృతి చెందినట్లు శనివారం గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..మోతె జ్ఞానేశ్వర్ చిన్నతనంలో తల్లిదండ్రిని కోల్పోయాడు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ట్రస్టులో విద్యనభ్యసిస్తున్నాడు. వేసవి సెలవులు రావడంతో మల్లాపూర్‌లోని అమ్మమ్మ వద్దకు వచ్చాడు. శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటున్న సమయం లో పాము కాటు వేసింది. అలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ఆసపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య


రాజవ్వ(ఫైల్)

కోనరావుపేట, జూన్ 8: కోనరావుపేట మండలం మందలపల్లె గ్రామానికి చెందిన అవురం రాజవ్వ(55) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అవురం రాజవ్వ కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధ పడుతోంది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. వైద్యుల సూచనల మేరకు ఐదేళ్లుగా మందులు వాడుతోంది. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనోవేదన గుర్తై శుక్రవారం రాత్రి కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గన్నేరువరం, జూన్ 8: మండలంలోని ఖాసింపేట గ్రామానికి చెందిన జక్కనపెళ్ళి రాయమల్లు(42) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయమలు గ్రామంలోని తన సోదరి రామంచ సత్తవ్వ నిర్మిస్తున్న నూతన గృహంలో ఫ్లోరింగ్ పనులను నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో మోటార్ వైర్ పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బంధువులు ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగలు కడిగి ఇస్తామని మోసం

- ఇద్దరికి గ్రామస్థుల దేహశుద్ధి

కోనరావుపేట, జూన్ 8: బంగారు ఆభరణాలను కడిగి ఇస్తామని మోసం చేయడానికి ప్రయత్నించిన ఇద్దరిని పట్టుకున్న గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మలకపేట గ్రామంలోని కట్ల మల్లవ్వ ఇంటికి వెళ్లిన ఇద్దరు బంగారు గొలుసులను కడిగి ఇస్తామని చెప్పారు. దీంతో మల్లవ్వ బంగారు గొలుసును వారికి ఇచ్చింది. వారి వద్ద ఉన్న కెమికల్ పూయడంతో బంగారు గొలుసు నల్లబడింది. మల్లవ్వకు మత్తుమందు పెట్టే ప్రయత్నం చేయగా కేకలు వేసింది. గ్రామస్థులు ఇద్దరిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. గ్రామపంచాయతీ వద్ద బంధించి కోనరావుపేట పోలీసులకు అప్పగించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి రూరల్, జూన్, 8: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మం డలంలోని ఆత్మనగర్ గ్రామం నుంచి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రెవెన్యూ అధికారి ఉమేశ్ తెలిపారు. శనివారం ఆత్మనగర్ గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా మెట్‌పల్లికి తరలిస్తున్నట్లు సమాచారం మేరకు పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అదే విధంగా మల్లాపూర్ మండలం నుంచి అక్రమంగా మెట్‌పల్లికి తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తర లింపు, నిల్వ చేసిన, చెరువల నుంచి మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనకదుర్గ చిట్ ఫండ్ చైర్మన్ అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 8: గడువు ముగిసినప్పటికీ చిట్ డబ్బులు మొత్తం చెల్లించక పోగా, చిట్ సభ్యురాలును బెదిరింపులకు గురిచేసిన కనకదుర్గ చిట్‌ఫండ్స్ చైర్మన్ రాగిడి తిరుపతిరెడ్డి, అతడి అనుచరుడు రాజులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని కరీంనగర్ రెండో టౌన్ సీఐ విజయకుమార్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గీతానగర్‌కు చెందిన ప్రస్తుతం కరీంనగర్ సుభాష్‌నగర్‌లో నివాసముంటున్న గడ్డం జమున అనే మహిళ కరీంనగర్‌లోని ఐబీ చౌరస్తాలోని కనకదుర్గ ప్రయివేట్ చిట్ ఫండ్‌లో 3 లక్షల రూపాయల చిట్‌లో సభ్యురాలిగా చేరింది. ఆ చిట్‌కి సంబంధించిన పూర్తి మొత్తం చెల్లించింది. గడువు ముగిసిన అనంతరం తనకు రావాల్సిన డబ్బులు అడిగింది. హనుమకొండ జిల్లా గోపాలాపూర్‌కు చెందిన రాగిడి తిరుపతయ్య అలియాస్ తిరుపతిరెడ్డి, అతడి అనుచరుడైన రాజులు రెండు ఖాళీ బ్యాంకు చెక్‌లు అందచేశారు. ఆ ఖాతాల్లో డబ్బులు లేక బ్యాంకుల్లో ఆ చెక్‌లు బౌన్స్ అయ్యాయి. ఈ విషయం బాధితురాలు జమున చిట్ ఫండ్ చైర్మన్ తిరుపతిరెడ్డికి చెప్పగా డబ్బులు ఇవ్వడం కుదరదని చెప్పడమేగాక మరోసారి అడిగితే చంపేస్తామని బెదిరింపులకు గురిచేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ విజయ్ కుమార్ విచారణ అనంతరం చిట్ ఫండ్ చైర్మన్‌రాగిడి తిరుపతిరెడ్డిపై తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 5 ప్రకారం కేసు నమోదు చేసి కోర్ట్‌లో హాజరు పరిచారు. నిందితుడికి రిమాండ్ విధించగా జైలుకు తరలించామని సీఐ తెలిపారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు



నర్మాలో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం

గంభీరావుపేట, జూన్ 8 : దహన సంస్కారాల కోసం గత ప్రభుత్వం నిర్మించిన వైకుంఠధామాలు కొన్ని చోట్ల నిరుపయోగంగా మారాయి. గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఊరికి దూరంగా, పూర్తి స్థాయిలో వసతులు లేక వైకుంఠధామాలను నిర్మించడంతో వినియోగంలోకి రాకుండా పోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని గ్రామాల్లోనైతే ఒక్క దహన సంస్కారం కూడా కాని వైకుంఠ ధామాలు లేకపోలేదు. ఒక్కో వైకుంఠధామం రూ.12.60 లక్షల అంచనాలతో నిర్మించారు. స్నానపు గదులు, మరుగు దొడ్లు, విశ్రాంతి గది, నీటి వసతి, కరంట్ సౌకర్యం ఉండే విధంగా వైకుంఠధామాలు నిర్మించాలి. కొన్ని గ్రామాల్లో రోడ్డు సౌకర్యం లేక పోవడం, మరి కొన్ని చోట్ల కరంట్ వసతి లేక పోవడం, ఇంకో చోట ఊరికి దూరంగా ఉండడం వంటి వసతుల లేమితో ఉన్నాయి. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని, వైకుంఠధామాలను వినియోగంలోకి తేవాలని, అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న విజయంపై సంబరాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ విజయంపై ఆ పార్టీ నాయకులు శనివారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పట్టభద్రుల ఎమ్మెల్సీతోపాటు 8 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్, రాజేందర్, రాంరెడ్డి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సాగర్‌తో సస్యశ్యామలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్, జూన్ 8 : తాము ప్రజాప్రతినిధులుగా ఉన్న సమయంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ హయాంలో మల్లన్న సాగర్ ద్వారా ఇక్కడి ప్రాంతం సస్యశ్యామలంగా మారడం మర్చిపోలేమని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. శనివారం ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముస్తాబాద్ మండలాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దడంలో భాగస్వాములమైనందుకు సంతోషంగా ఉందన్నారు. వర్షాలు పడగానే ఈజీఎస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, ఒకే రోజు ప్రతి గ్రామంలో పెద్దఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. అంతకు ముందు బందనకల్ పాఠశాలలో నిధులు లేక పాఠశాలలో నిర్మాణ పనులు ఆగిపోయాయని ఎంపీటీసీ రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. మూసిన పాఠశాలలను పునః ప్రారంభించాలని, ప్రైవేటు పాఠశాలల ఫీజుల వివరాలను పాఠశాలలో తల్లిదండ్రులకు కనబరిచేలా పొందు పర్చాలని ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ అన్నారు. మిషన్ భగీరథ పనులు చేపట్టినా నీరు రావడం లేదని, సీసీ రోడ్లు పగుల గొట్టి మళ్లీ నిర్మించలేదని మండిపడ్డారు. ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలు జరగుతున్నా పట్టించుకునేవారు కరవయ్యారని, ముస్తాబాద్‌లో సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు జరగుతున్నా అధికారులు చోద్యం చేస్తున్నారని ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని, పెద్ద వాళ్లకు సైతం టీబీ రాకుండా వ్యాక్సిన్ వచ్చిందన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందని ప్రభుత్వ వైద్యాధికారి గీతాంజలి పేర్కొన్నారు. అంగన్‌వాడీ పాఠశాలల వివరాలు తెలపాలని ఐసీడీఎస్ అధికారులను ఎంపీపీ ఆదేశించారు. అనంతరం ఎంపీపీ జనగామ శరత్‌రావు మాట్లాడుతూ జడ్పీ టీసీగా, ప్రస్తుతం ఎంపీపీగా పదేళ్లుగా ప్రజాసేవ చేయడంతో సంతోషాన్ని కలిగించిదన్నారు. కేసీఆర్, కేటీఆర్ పాలనలో ముస్తాబాద్ మండలానికి డైరెక్ట్‌గా పదివేల ఎకరాలు, మల్లన్న సాగర్ ద్వారా 30 చెరువులను నింపడం సంతోషాన్నిచ్చిందన్నారు. మరో నెల రోజుల్లో పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంలో ఎంపీపీ శరత్‌రావు భావోద్వేగానికి గురయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేశారని ముస్తాబాద్ మండలాన్ని ఆదర్శంగా నిలిపారని అన్నారు. ముస్తాబాద్-దుబ్బాక డబల్ రోడ్డు నిధులు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేస్తే టెండర్ అయ్యాక కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకెళ్లిందన్నారు. సమన్వయంతో ముస్తాబాద్ మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఎంపీటీసీలకు సన్మానం

ముస్తాబాద్ మండలంలోని ఎంపీటీసీలకు ఎంపీపీ శరత్‌రావు అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిషత్‌లో చివరి సర్వసభ్య సమావేశం కావడంతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.



హాజరైన ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు

కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, జూన్ 8: రుద్రంగిలోని ఇందిరాచౌక్ చౌరస్తాలో కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతులకు హామీ ఇచ్చారు. రుద్రంగి మండల కేంద్రంలో శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరా చౌక్ చౌరస్తాలో కూరగాయాలు అమ్మడానికి సరైన వసతులు లేవని కూరగాయలు అమ్మడానికి షెడ్ నిర్మాణం చేయించాలని ఆది శ్రీనివాస్‌ను మహిళా రైతులు కోరారు. జడ్పీటీసీ గట్ల మీనయ్య కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య తిరుపతి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, జూన్ 8: మండలంలోని సోమారంపేట గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మికి ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్)ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం కార్యాలయంలో అందించారు. రాజ్యలక్ష్మి అనారోగ్యానికి గురికాగా రూ 2లక్షల ఎల్‌వోసీని వైద్యఖర్చుల కోసం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, నాయకులు యాస తిరుపతి, ఆకుల సత్యం, బిగుళ్ళ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీ నోటీసులు పంపిన పూజారి

వేములవాడ టౌన్, జూన్ 8: అధిక వడ్డీ ఆశచూపి డబ్బులు వసూలు చేసిన పూజారి వ్యవహారం మరో మలుపు తిరిగింది. తాజాగా సదరు పూజారి 8 మందికి ఐపీ నోటీసులు పంపినట్లు తెలుస్తోంది. సదరు జ్యోతిష్యుడు వద్ద రూ. 10 లక్షల నుంచి రూ. కోటి 50 లక్షల వరకు అప్పు తీసుకున్నట్లు, వారి వివరాలను తెలుపుతూ నోటీసులు పంపించినట్లు సమాచారం. అధిక వడ్డీ ఆశతో ఇతరుల వద్ద అప్పులు తీసుకొచ్చి మరీ జ్యోతిష్యుడుకి ఇచ్చిన వారు ఐపీ నోటీసులను చూసి షాకవుతున్నారు.

పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ

ముస్తాబాద్, జూన్ 8: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫారాలు, ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను శనివారం అందించారు. గ్రామాల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి బడీడు పిల్లలందరు బళ్లో చేర్పించాలని మండల నోడల్ ఆఫీసర్ రాజారెడ్డి అన్నారు. పదో తరగతి విద్యార్థులకు నోట్‌బుక్కులు అందించారు. కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది మల్లారపు శ్రీకాంత్‌రెడ్డి, తుమ్మ రాజేందర్, రమాదేవి, పర్శరాములు, రాజు, జయంతి, సాయికుమార్ పలు పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు వ్యక్తిత్వం ఆదర్శ ప్రాయం

గంభీరావుపేట, జూన్ 8: ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు వ్యక్తిత్వం అందరికీ ఆదర్శ ప్రాయమని మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం శనివారం ప్రకటనలో తెలిపారు. రామోజీరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని వెల్లడించారు. 1983లో తెలుగుదేశం పార్టీ సహకారంతో సంజయ్ విచార్ మంచ్ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సందర్భంలో తొలిసారి రామోజీరావును వ్యక్తిగతంగా కలిసినట్లు తెలిపారు.

వర్షాలు కురవాలని వరద పాశం

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు విరివిగా పండాలని వేడుతూ ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన రైతులు గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. వరద పాశం జరిపించారు. కార్యక్రమంలో రైతులు రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న గ్రామస్థులు

తంగళ్లపల్లి, జూన్ 8: మండల కేంద్రంలోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎడమల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుంచి బోనంతో మహిళలు ఊరేగింపుగా పోచమ్మ గుడి వరకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చల్మెడ పరామర్శ

కోనరావుపేట, జూన్ 8 : కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన కొలకాని నవీన్ అనే యువకుడు ఇటీవల మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. శనివారం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, నాయకులు ఆరె మహేందర్, శివ తేజరావు, యాస రాజం, ముదారి శ్రీనివాస్, కొలకాని నాగరాజు, పాక సత్తయ్య చెక్కపెల్లి చంద్రయ్య, రాజం, వెంకటేష్, రంజిత్, నజీర్, వినయ్ ఉన్నారు.

గడ్డివాములు దగ్ధం

మల్యాల, జూన్ 8: మండలంలోని పోతారంలో ప్రమాదవశత్తూ నిప్పంటుకొని ఎనుగంటి ప్రశాంత్ అనే రైతుకు చెందిన 1500వరి గడ్డి కట్టలు దగ్ధం అయ్యాయి. గడ్డికి నిప్పంటుకోవడంతో స్థానికులు జగిత్యాలలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలంకు వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఫైర్ సిబ్బంది మధు, నరేష్, వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మతోన్మాద కార్పొరేట్‌కు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్

వేములవాడ టౌన్, జూన్ 8: కష్టజీవుల రక్త మాంసాలు పీల్చుకుతినే కార్పొరేట్ల తరుపున మతోన్మాద బీజేపీ నిలుస్తోందని, మతోన్మాదానికి, కార్పొరేట్లకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండాను జిల్లా కమిటీ సభ్యుడు ముక్తికాంతం అశోక్ ఆవిష్కరించారు. అనంతరం అబ్బాస్ మాట్లాడుతూ దేశంలో మరోసారి మతోన్మాదులు అధికారంలోకి వచ్చారని, తద్వారా దేశ సమైకృతకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఉత్తర తెలంగాణలో మతోన్మాద శక్తులు గెలిచాయని గ్రామ సీమల్లో పట్టణాల్లో కుల, మత ఘర్షణలను పెంచడం, విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధి పొంతుతున్నారని విమర్శించారు. ప్రజలు ఆకలి, పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యల పరిష్కారం కోసం కుల, మతాలకు అతీతంగా ఐక్యంగా కృషి చేసే పరిస్థితులు ఏర్పడాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కూలీల కష్టానికి ఫలితం, కార్మికుల కనీస వేతనాలు వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదని, రోజు రోజుకు మతవిద్వేషాలు పెరిగిపోతున్నాయని విమర్శించారు. మను ధర్మ శాస్త్రం పేరుతో కులాల మధ్య మతాల మధ్య అసమానతలను పెంచిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మ్యాజిక్ ఫిగర్ రాలేదని, చావు తప్పి కన్నులొట్ట పోయినట్లుగా సీట్లు సాధించిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లను సవరిస్తామని చెప్పిన మాటలను ప్రజలు తిరస్కరించారని, తగిన గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. 240 పరిమితం చేశారన్నారు. ఈ సమావేశంలో విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రవెల్లి నాగరాజు, గన్నారం నర్సయ్య కోడం రమణ, జవ్వాజి విమల, మల్లారపు అరుణ్‌కుమార్, సూరం పద్మ, గురిజాల శ్రీధర్, మల్లారపు ప్రశాంత్, గుర్రం అశోక్, రామంచ అశోక్, చిలు బాబు, మల్లా నర్సయ్య కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

రామోజీరావుకు ప్రముఖుల నివాళులు

వేములవాడ టౌన్, జూన్ 8 : ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతి చెందడంతో వేములవాడకు చెందిన పలువురు ప్రముఖులు శనివారం నివాళులు అర్పించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తన నివాసంలో నివాళులు అర్పించి రామోజీరావు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పేదల గొంతుకగా నిలిచిన రామోజీరావు లేరనే వార్త తనను కలిచివేసిందన్నారు. బుల్లి తెరద్వారా ఎంతో మంది కళాకారులకు జీవితాన్నిచ్చిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. రామోజీరావు మృతి దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. పట్టణ బీజేపీ నాయకులు ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న ప్రతాప రామకృష్ణ

కూరగాయల మార్కెట్ నిర్మించాలి



గంభీరావుపేటలో స్పీడ్ పోస్ట్ అందజేస్తున్న స్థానికులు

గంభీరావుపేట, జూన్ 8: గంభీరావుపేట మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోసం శనివారం అధికారులకు పోస్ట్ ఆఫీస్‌లో స్పీడ్ పోస్ట్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం కొనసాగే కూరగాయల మార్కెట్ అసౌకర్యాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. వానలో తడుస్తూ ఎండలో ఎండుతూ మార్కెట్‌లో కూర గాయలను క్రయ విక్రయాలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నూతన మార్కెట్‌ను విశాలంగా నిర్మించే క్రమంలో ఉన్న మార్కెట్‌ను తొలగించారని పేర్కొన్నారు. ఈ లోపు ఎన్నికలు రావడంతో కొత్త మార్కెట్ యార్డు నిర్మాణాన్ని మరిచి పోయారన్నారు. కూర గాయల క్రయ విక్రయాల్లో భాగంగా ఏర్పడుతున్న అసౌకర్యాలపై అధికారులు స్పందించాలన్నారు. తక్షణమే నూతన మార్కెట్ యార్డును నిర్మించాలన్నారు. గ్రామ పురోహితులు పార్థసారధిశర్మ తదితరులు ఉన్నారు.

నీట్‌ను తిరిగి నిర్వహించాలి

జగిత్యాల అర్బన్, జూన్ 8: నీట్-2024 పరీక్షను తిరిగి నిర్వహించాలని విద్యా ర్థులు డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకేజీపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పరీక్ష నిర్వహణ, ఫలితాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, జిల్లా కేంద్రంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద శనివారం స్థానిక వైద్య విద్యార్థులు ప్లకార్డులలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ చరిత్రలో ఇద్దరు, ముగ్గురికి మినహా ఆల్ ఇండియా లెవల్ మొదటి స్థాయి ర్యాంకులు రాలేదని, ప్రస్తుత పరీక్షలో ఏకంగా 60 మందికిపైగా ఆల్ ఇండియా మొదటి ర్యాంకులు రావడం అనుమానాలకు తావిస్తుందన్నారు. దేశంలోని ఢిల్లీ, హర్యానాలో పేపర్ లీకేజీపై ఆరోపణలు వచ్చాయని, దీనిపై ఎన్టీయే స్పందించకపోవడం విచారకరం అన్నారు. నాలుగైదేళ్ల కోచింగ్ తీసుకునే విద్యార్థులకు సైతం మొదటి ర్యాంకు కష్టతరంగా ఉండే నీట్‌లో అంతమంది విద్యార్థులకు ప్రథమ స్థాయి ర్యాంకులు రావడం అసాధ్యం అన్నారు. నెగిటివ్ మార్కులకు, ఫలితాల్లో వచ్చిన మార్కులకు పొంతన లేకుండా మార్కులు రావడం అనుమానాలకు బలం చేకూర్చేలా ఉంద న్నారు. 24లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడే విధంగా నేషనల్ టెస్ట్ ఏజెన్సీ(ఎన్టీయే) వ్యవహరించడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా తక్షణమే పేపర్ లీకేజీ ఆరోపణలపై జ్యూడీషియల్ విచారణ జరిపించడంతో పాటు, నీట్ 2024ను పరీక్షను తిరిగి నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



జగిత్యాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఎల్లారెడ్డిపేటలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలో..

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, గొల్లపల్లి, వెంకటాపూర్, నారాయణపూర్, గుండారం, బండలింగంపల్లి తదితర గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రదర్శనలు చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ కర పత్రాలను అందిస్తూ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితర పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తోందన్నారు. ప్రవేట్ పాఠశాలల్లో చేర్పించి ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దని కోరారు. పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలంటూ బడిబాట కార్యక్రమంలో పలు గ్రామాల్లో కొనసాగుతోంది. మండలంలోని గాలిపెల్లి, కందికట్కూర్, వల్లంపట్ల తదితర గ్రామాల్లో శనివారం ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తిరుమల, బ్రహ్మచారి, స్వామి, సత్తమ్మ, ఎస్ఎమ్‌సీ చైర్‌పర్సన్ ఎంద్ర ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

పది కిలోల చేప లభ్యం

ముస్తాబాద్, జూన్ 8: మృగశిర పూట బంగారు తీగ మెరిసింది. ముస్తాబాద్ మండలంలోని బందనకల్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మృగశిర పూట శనివారం చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో పడిగె రాజు అనే యువకుడికి పదికిలోల బంగారు తీగ చేప వలలో చిక్కింది. బంగారు తీగ వలలో చిక్కడంతో యువకుడు సంతోషాన్ని వ్యక్తం చేశాడు.



చేపను చూపిస్తున్న యువకుడు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రీడాకారులతో సీఐ వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు

కోనరావుపేట, జూన్ 8 : క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్లలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. యువత క్రీడలతోపాటు చదువులో రాణించాలన్నారు. మొదటి బహుమతి రూ.20 వేలు జడ్పీటీసీ శ్రీకుమార్, రెండో బహుమతి భాస్కరరావు రూ.10 వేలు అందజేశారు. కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఎంపీటీసీ రేణుక, మాజీ సర్పంచులు అశోక్, సింగం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్ట్ టెస్టు పోటీలు



బెల్ట్‌లను సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రకాష్

సిరిసిల్ల టౌన్, జూన్ 8: స్పార్క్ కుంగ్‌ఫూ అకాడమీ, స్పార్కుకుంగ్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణం వెంకంపేట కృష్ణ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు బెల్ట్ టెస్టు పోటీలను నిర్వహించారు. . బెల్ట్ టెస్టులో భాగంగా విద్యార్థులు నాన్‌చాక్ డబుల్, స్టిక్ రోలింగ్, స్టిక్ కటాస్, బైక్ స్టంట్, హ్యాండ్ మూమెంట్, కటాస్, లెగ్ స్టాండింగ్ అండ్ స్ట్రెచింగ్‌లో ప్రావీణ్యతను ప్రదర్శించారు. బెల్ట్ టెస్టులో 13 మంది విద్యార్థులకు బ్లాక్ బెల్ట్, ఐదుగురుకి బ్రౌన్‌బెల్ట్‌లకు అర్హతను సాధించారు. అనంతరం జరిగిన బెల్ట్‌ల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ విద్యార్థులకు బెల్ట్‌లతో పాటు ప్రశంసాపత్రాలను ప్రధానం చేసి పుష్ప గుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, డాక్టర్ మంజుషా, సిరిసిల్ల మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ బైరి ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మినారాయణ, సిరిసిల్ల స్పార్క్ కుంగ్‌ఫూ అకాడమీ, వేములవాడ స్పార్కుకుంగ్ అకాడమీ మాస్టర్లు ఒడ్నాల శ్రీనివాస్, గగ్గూరు దివ్య, మాస్టర్లు మామిడాల సమ్మయ్య, ఎండీ సమీనా, కనకయ్య, శ్రీనివాస్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతు విజయవంతం చేయాలి

కోనరావుపేట, జూన్ 8: మాదిగల ఆత్మగౌరవ కవాతు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 7న వరంగల్‌లో కవాతు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డప్పుల నాగరాజు, జాన్, మల్యాల లచ్చయ్య, దొబ్బల భూమయ్య, గొర్రె సుధాకర్, మల్యాల జాన్సన్, మంగలి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లపై ఫిర్యాదు

సిరిసిల్ల క్రైం, జూన్ 8: సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక సందర్భంగా సమావేశమైన తమపై అనవసర పదజాలంతో మాట్లాడిన డైరెక్టర్లు చొప్పదండి ప్రమోద్, పత్తిపాక సురేశ్‌పై అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ అడ్డగట్ల మురళి శనివారం సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అర్బన్ బ్యాంకు వద్ద ఇద్దరు డైరెక్టర్‌లు ఇష్టానుసారంగా మాట్లాడారని, వారిపై చర్యలు తీసుకోవాలని టౌన్ ఎస్సై శ్రీనివాస్‌రావును కోరారు.

బాధిత కుటుంబానికి ఆది శ్రీనివాస్ పరామర్శ

చందుర్తి, జూన్ 8 : చందుర్తి మండలం రామారావుపల్లె గ్రామంలో ఇటీవల మృతి చెందిన లింగంపల్లి శ్రీనివాస్ కుటుంబాన్ని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేష్, నాయకులు చింతపంటి రామస్వామి, ముస్కు ముకుంద రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో నంద్యాడపు నర్సింగ్ మృతి చెందగా శనివారం బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకల తిరుపతి, గండి నారాయణ, కెసిరెడ్డి నర్సరెడ్డి, కోమిరె శంకర్, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, తదితరులు పాల్గొన్నారు.